శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేది లేదు



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత ఆశయాలతో నిర్వహిస్తున్న స్పందన వేదికలో అందే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారుల అలసత్వాన్ని సహించబోమని హెచ్చరించారు. సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన స్పందనలోని ఫిర్యాదులను పరిష్కరించలేని అధికారులపై కమిషనర్ డి.హరిత అసంతృప్తి వ్యక్తపరిచారు. కచ్చితంగా నిర్దిష్ట గడువు లోగా అన్ని ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం ద్వారా ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల వరకు ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచనలు జారీ చేశారు. అనంతరం ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని విభాగాల ఉన్నతాధికారులు తమకు సంబంధించిన ఫైళ్లు పెండింగులో లేకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. స్పందన అర్జీదారుని ఫోటో, సమస్య ఫోటోతో పాటు పరిష్కారం అనంతరం ఫోటోను ఆన్‌లైన్‌లో కచ్చితంగా పొందుపరచాలని కమిషనర్ సూచించారు. వేదికలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్దాయి అండర్ 15 బాలుర,బాలిక చదరంగం పోటీలు

**బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు చెస్ అసోసియేషన్ ఆద్వర్యంలో సెప్టెంబర్ 18 వ తేదిఆదివారం జిల్లా స్దాయి అండర్ 15 బాలుర,బాలికల చదరంగం పోటీలు కోవూరులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ నందు ఉదయం 9 గంటల నుండి నిర్వహించబడును అని నెల్లూరు చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభకనబరచి మొదటి రెండు స్దానాలలో నిలిచిన బాలురు,బాలికలను రాష్ట్రస్దాయి, అండర్ 15 చదరంగ పోటీలలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈ పోటీలలో పాల్గొన దలచుకున్న క్రీడా కారులు 1,1,2007 తరువాత పుట్టిన వారు అయి ఉండాలి. జనన ధృవీకరణ పత్రం సమర్పించాలి. ఆసక్తిగల క్రీడాకారులు వివరాలకు 9848147889 నెంబర్‌కు సంప్రదించవలసిందిగా నెల్లూరు చెస్ అసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌బాబు

# నూతన ఆలయాల నిర్మాణానికి కృషి

**వెంకటాచలం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** గిరిజనులకు భగవంతుడు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఎస్సీ,ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో నూతన ఆలయాలు అభివృద్ధికి కృషి చేయటం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. మండల పరిదిలోని కసుమూరు గ్రామంలో శ్రీనివాస ఎస్టీ కాలనీలో టిడిటి వాణి ట్రస్ట్ ఆర్ధిక సహాయంతో సమరత సేవా పౌండేషన్ ఆద్వర్యంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శాస్త్రకంగా భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లడుతూ గిరిజన కాలనీలో ఆలయాలు నిర్మించి గిరిజనలకు పూజారులుగా నియమించి గిరిజనలకే పూజా విదానాలపై పూర్తి స్దాయిలో శిక్షణ,ఇచ్చి పూజారులుగా నియమించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిటిడి ఆద్వర్యంలో ఆలయాలు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు



తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1342 ఆలయాలు ఎంపిక చేసి 111 ఆలయాలు మెదట విడతగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గానికి 11 ఆలయాలు టిటిడి అదికారులు విజ్ఞప్తి చేసి మంజూరు చేయించామన్నారు. ప్రాధాన్యాత క్రమంలో గిరిజన కాలనీలు గుర్తించి దేవాలయాలను నిర్మించేందకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాఓ 60 ఆలయాలు దూప దీప నైనేద్యం పధకం ద్వారా ఒక్కోక్క ఆలయానికి నేలకు ఐదు వేలు రూపాయలు ఇవ్వగా ,మరో 110 ఆలయాలు ఈపధకం క్రింద గుర్తించి 10 వేలు రూపాయలు పెంచి ఇవ్వడం జరిగిందన్నారు. హిందుదర్మపరిరక్షణకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తాము అదికారంలోకి వచ్చిన మూడుళ్లలో ఆలయాలు చర్చిలు మసీదులు అభివృద్ధికి అనేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నూతనంగా ఎంపికైనా వాలీంటర్లుకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈకార్యక్రములో సమరత సేవా పౌండేషన్ రాష్ట్ర సహయ కార్యదర్శి కోట సునీల్‌కూమర్,రాష్ట్ర సంయోజక్ కోండారెడ్డి, ఎంపీడివో సుస్మితరెడ్డి ఎంపిపి మందా కవిత, సర్పంచ్ కడివేటి శివకుమార్,జిల్లా వైసిపి అదికార ప్రతినిది మందల వెంకటశేషయ్య, పాల్గోన్నారు.

**పేదలకు వైయస్సార్ కళ్యాణమస్తు వరం**

పేదింటి ఆడ పిల్లలకు వైయస్సార్ కళ్యాణమస్తు వరం లాంటింది రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. పేదల కుటుంబాలల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో కుటుంబానికి ఆండగా ఉండాలనే ఉద్దేశంతో వైయస్సార్ కళ్యాణమస్తు పదకానికి శ్రీకారం చుట్టారన్నారు. అక్టోబర్ 1 నుంచి ఈ పదకాని ప్రారంబించనట్లు మంత్రి తెలిపారు. కసుమూరు గ్రామంలో వైయస్సార్,సిఎం చిత్రపటానికి గ్రామస్తులు పాలభిషేకం నిర్వహించారు.

## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బ్యాండ్మింటన్ పోటీల్లో నెల్లూరీయుని ప్రతిభ



**నెల్లూరు,సెప్టెంబరు12 ప్రభాతవార్త-విద్య** ఈనెల 8నుండి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పబ్‌జూనియర్స్ అండర్-17 బా ్యడ్మింటన్ పోటీల్లో నగరానికి చెందిన టి.అనీష్ డానీ బాలుర సింగల్స్ విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాదించి సత్తా చాటారు. ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార ్యక్రమంలో ఆంధ్రా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరపు రామ్మోహన్ నాయుడులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతు రాష్ట్రస్థాయి పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారుడు ఉత్తమ ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థాయి బహుమతి సాధించటం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో డానీ మరిన్ని విజయాలు సాదించాలని ఆయన కోరారు. అలాగే డానీ రాష్ట్రస్థాయి బహుమతిని అందుకోవటం పట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు దూడల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మలవీర వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిమద్దిపాటి ప్రసాద్ రావు, కోశాధికారి శ్రీకాంత్ లు అభినందించారు. అక్టోబరులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో డానీ పాల్గొని విజయం సాధించటం ద్వారా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.

# దళితులపై జరుగుతున్న దాడులపై సత్వరన్యాయం

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** జిల్లాలో ఎస్సీ ఎస్టీలపై జరుగుతున్న దాడులకు సంబంధించి నమోదైన కేసులను సత్వరమే పరిష్కరించాలని..బాధిత కుటుంబాలకు వేగవంతంగా న్యాయం అందించేలా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాధ్ సూచించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం సాయంత్రం జరిగిన జిల్లాస్థాయి నిఘా-పర్యవేక్షణ కమిటీ (ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధచట్టం) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాచార చట్టం కింద నమోదైన కేసుల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించడంతోపాటు బాధిత కుటుంబాలకు న్యాయం అందేలా అధికారులు పనిచేయాలన్నారు. కేసులవారీగా సమీక్షించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకశ్రద్ద తీసుకోవాలని జేసీ ఈ సందర్భంగా




రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. గడచిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షించుకోవాలన్న ఆయన అలాగే ప్రస్తుత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వచ్చే సమావేశం నాటికి అమలయ్యేలా చూడాలన్నారు. ఇక ఉన్నత న్యాయస్దానంలో పెండింగ్‌లో వున్న కేసుల విషయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రతించి సత్వరమే ఆ కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఇక బాధితులకు సత్వరన్యాయం జరిగేలా కేసుల విచారణ జరగాలన్న రోణంకి కూర్మనాధ్ కమిటీ సభ్యులు ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి సంబందించి కమిటీ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు.

**అత్యాచార నిరోధకచట్టంపై అవగాహన**

సమావేశంలో పాల్గొన్న ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధకచట్టంపై ప్రజలకు అవగాహన కలిగేలా గ్రామ-వార్డు సచివాలయాలలో బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటుచేయాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు జిల్లాలో ఎస్సీ ఎస్టీలపై జరిగిన దాడులతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు, దళితవాడలలోని ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాగా ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి, ఏఎస్పీ హిమవతి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, ఆర్డిఓలు మలోల (నెల్లూరు), శీనానాయక్ (కావలి), కరుణకుమారి (నెల్లూరు)లతోపాటు కమిటీ సభ్యులయిన డిఇఒ రమేష్, ఉపాధి కల్పనాదికారి సురేష్‌కుమార్, మునిసిపల్‌శాఖ ఏడి ప్రదీప్, కమిటీ సభ్యులైన కె.రఘు, సుదర్శనరం, సుబ్బరాయుడు, బాలయ్య, కేసీపెంచలయ్య, ప్రసన్నగణపతి, ఖాజారసూల్, డిఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

## క్రైమ్‌కి కేంద్ర బిందువు నెల్లూరు జిల్లా



**నెల్లూరు సెప్టెంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం** నేరాలకు, హత్యలకు, అరాచకాలకు, దుర్మార్గాలకు, అన్యాయాలకు, అక్రమాలకు రాష్ట్రంలోనే కేంద్ర బిందువుగా నెల్లూరు జిల్లా, అందులో ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గం మారిపోయిందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని స్థానిక దర్గామిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్దాసుపత్రిలో జంట హత్యలకు గురి కాబడ్డ మృతులు రమణారెడ్డి, శ్రీకాంత్‌ల మృతదేహాలను మాజీ కార్పొరేషన్ మేయర్ అబ్దుల్‌అజీజ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి జెన్ని.రమణయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులు తిరగకుండా మళ్ళీ శవాల గదికి తాము రావాల్సిన అవసరం వచ్చిందన్నారు. నేరాలకు ఈ జిల్లాలో అడ్డు అదుపు లేకుండా పోతోందని పోలీసు యంత్రాంగం నిద్రమత్తులో ఉందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక దశలవారీగా మద్యపాన నిషేధం చేస్తామని చెప్పారని మద్యపాన నిషేధం విషయం ఏమిటో గాని రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, గంజాయి, సొల్యూషన్ వినియోగాలు అధికమైయ్యాయని ఆయన ఆరోపించారు. ఒక వ్యక్తి మత్తులోకి పోతే అతనికి తల్లి, చెల్లి, భార్య పరాయి వాళ్ళు అనే తేడా తెలియడం లేదని అలాంటి వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఇందులో పోలీసుల పాత్ర ఉందని నేరం జరిగిన 5,6రోజుల్లో నేరస్థులను పట్టుకుంటున్నారని, కానీ మేము ప్రశ్నిస్తుండేది మీ పనితీరు గురించి, పట్టుకునే విధానం గురించి కాదని ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఏమి చేయ్యాలో ఆలోచించాలని సూచించారు. నేరాలు ఎందుకు పెరుగుతున్నాయో ప్రజల్లో ఇలాంటి ఆలోచనలు రాకుండా ఉండాలంటే ఏమి చేయాలో ఎస్పీ ఆలోచించాలని అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం అధికమై ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయో లేక మానసిక స్థితి బాగోలేక జరుగుతున్నాయో కనిపెట్టాలని, ఆడబిడ్డలు బయటికి వెళ్ళాలంటే వారు ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళనలో గడపాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్న చిన్న పిల్లలు సైతం నేరాలకు పాల్పడుతున్నారని, వీటిని ఏ విధంగా నివారించాలో చర్యలు తీసుకోవాలని పోలీసులకు హితవు పలికారు. ఏదో రాజకీయ నాయకుడు వచ్చి రెండు మాటలు మాట్లాడిపోతున్నాడని, అలా కాకుండా భవిష్యత్తు గురించి ఆలోచించాలని మన బిడ్డల గురించి ఆలోచించాలని మేధావులంతా కూర్చొని దీన్ని తీర్మానించాలని, మద్యపానం వల్ల ఎంత ఆదాయం వచ్చినా దాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలని ఆయన డిమాండ్ చేశారు. మద్యపానాన్ని పూర్తిస్థాయిలో నిషేధించి దాని వల్ల వచ్చే ఆదాయాన్ని మరోరకంగా తీసుకోవాలని, మత్తు పదార్థాల వల్ల సమాజానికి మామూలు హాని జరగడం లేదన్నారు. పోలీసులు అప్రమత్తమై, రాజకీయ ఒత్తిళ్ళకు లొంగకుండా మత్తు పదార్థాలు సేవించే వారు ఏపార్టీ వారైనా సరే శిక్షించాలన్నారు.

పాఠశాలలో మాదక ద్రవ్యాల బారినపడకుండా ఉండేందుకు శిక్షణా తరగతులను ఇవ్వాలన్నారు. నేరస్థులను పట్టుకోవడం గొప్పతనం కాదని, అవి జరగకుండా నియంత్రించడమే గొప్పతనమన్నారు. పోలీసులను తిట్టడానికి పోలీసులు మా ప్రత్యర్థులు కాదని, వారు పోలీసింగ్ బాగా చేస్తే మాతోపాటు, వారి కుటుంబాలు కూడా బాగుంటాయన్నారు. జిల్లా ఎస్పీ విజయరావు తన చుట్టూ గీసుకున్న గీతను దాటి బయటకు రావాలని ప్రజలను రక్షించాలని, రాజకీయాలకు అతీతంగా మత్తు పదార్థాలు అమ్మే వారిపై ఉక్కుపాదం మోపాలని ఆయన కోరారు. మృతి చెందిన శ్రీకాంత్‌కు ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ కింద రావాల్సిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాభిర్‌ఖాన్, జలదంకి.సుధాకర్, మాతంగి.కృష్ణా, కనపర్తి.గంగాధర్, ఈదర.శ్రీనివాసులు, రవీంద్ర, అమృల్లా, అల్లాబక్షు, శివాచారి, రమణయ్యనాయుడు, సోమశేఖర్‌రెడ్డి, ఖదీర్, అస్లామ్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కార వేదిక గడగడపకు మన ప్రభుత్వం

**ఆత్మకూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలంలో చెర్లో యడవల్లి సచివాలయ పరిధిలో సోమవారం నాడు ఆయన గడపగడపకు మన ప్రభుత ్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సమస్యలు పరిష్కరించుకోవడాని ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారులు,డ్రైనేజి సమస్యలను తన దృష్టికి వచ్చిన వాటిని పరిష్కరిస్తామనని అన్నారు. స్దానిక ఉన్న ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్దులతో మమేమమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి,జగనన్న విద్యాకానుక,సక్రమంగా అందుతున్నాయా లేదా అని వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున ్న వైఎస్ఆర్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విక్రమ్‌రెడ్డి రైతుల్ని కోరారు. రావులు కొల్లు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర సమీపంలో మొక్కలు నాటే కార ్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరు మొక్కలు నాటే



కార్యక్రమంలో భాగస్వామలు కావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన పలువురు ప్రజాప్రతినిదులు,ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి,తోపాటు అధికారులు పాల్గోన్నారు.

# మత్తు రహిత సమాజస్దాపనకు కృషి

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** మత్తు రహిత సమాజ స్దాపనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా రెవెనూయ అధికారి వెంకటనారాయణమ్మ పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విభిన్న ప్రతిభావంతులు-వయోవృద్దులశాఖ ఏడి నాగరా జకుమారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం నెల్లూరులోని గాంధీబొమ్మ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్‌హాల్‌లో ప్రతిజ్ఞ చేయించిన డిఆర్వో ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డ వ్యక్తి తాను క్షీణించడంతోపాటు కుటుంబానికి, సమాజానికి హానికరంగా తయారవుతాడన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పొగాకు, సిగరెట్టు, మద్యపానం, గంజాయి, ఉత్ప్రేరక మందులకు దూరంగా వుండాలన్నారు. దేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రధక భూమిక పోషించాలని డిఆర్వో ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కాగాఈ కార్యక్ర మంలో ఎన్‌సీసీ చీఫ్ బాలబ్రహ్మయ్య పాల్గొన్నారు.



# రైతులతోపాటు మత్స్యకారుల సంక్షేమం

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రైతులతోపాటు మత్స్యకారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్‌ప్రాసెసింగ్‌శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మత్స్యకార సహకారసమితి ఆధ్వర్యంలో నెల్లూరు విఆర్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి స్టాల్స్‌ను పరిశీలించిన మంత్రి చేపలతో చేసిన పలు ఆహారాలను రుచిచూశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మత్స్యకార సహకార సమితి ఈనెల 10 నుండి మూడు రోజులపాటు నెల్లూరులో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తూ సముద్ర ఉత్పత్తులకు సంబందించిన స్టాల్స్ ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఎటువంటి రసాయనాలు కలపకుండా చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లతో



ప్రదర్శించడం, అమ్మకాలు జరుపుతుండడం అభినందనీయమన్నారు. మారుతున్న పరిస్దితులలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించిన ఉత్పత్తులు కాకుండా సేంద్రీయ ఎరువుల వినియోగ ఉత్పత్తులపై ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారన్న కాకాణి ఇది ఎంతో శుభపరిణామమన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల వల్ల భూసారం పెరగడంతోపాటు అవి తిన్న ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. ప్రతి ఏడాది ఇటువంటి ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్స్ ఏర్పాటుచేసి ప్రజలకు ఆయా వంటకాలను పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో వుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేకదృష్టి సారించడంతోపాటు ప్రకృతి వ్యవసాయంపై ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసే ఆలోచన వున్నట్లు పేర్కొన్న మంత్రి సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు అన్ని విధాలుగా అండగా వుండడం జరుగుతోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నెల్లూరు ఆర్డిఓ మలోల, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ సుధాకర్‌రాజు, ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, మత్స్యకార సంక్షేమసమితి రాష్ట్ర అధ్యక్షులు కోలంగారి పోలయ్య పాల్గొన్నారు.

## చౌకదుకాణంపై విజిలెన్స్ దాడులు

**కోవూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** కోవూరులోని ఆంజనేయస్వామి దేవస్దానం సమీపంలో ఉన్న చౌకడిపోపై సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌకదుకాణంలో 3వేల ఒక్క వంద కిలోల రైస్‌ను స్టాకు మించి ఉండడంతో సంబంధిత డీలర్ ఎంబియు డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేయడం జరిగిందని విజిలెన్స్ సిఐ టి పెంచలరెడ్డి తెలిపారు. సీజ్ చేసిన బియ్యం విలువ 101898 విలువ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దాడులలో విజిలెన్స్ ఏఓ సంగమేశ్వరరెడ్డి, కోవూరు సిఎస్‌డిటి కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

## సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్లపై అవగాహన



**అల్లూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సోమవారం రిజిస్ట్రేషన్లపై అవగాహన కార్యక్రమాన్ని అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరు మండలంలోని సచివాలయలలో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న కాలనీలలో ఏర్పాటు చేసిన ఇళ్ళ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు ఏ విధంగా చేయాలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం,సోమవారం నిర్వహించామని తెలిపారు. వారికి ఎలాంటి సందేహాలు వున్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించవచ్చునని సబ్‌రిజిస్ట్రార్ వంశీకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు కెఎస్ఆర్ ఫౌండేషన్ చేయూత

**అల్లూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** అల్లూరు మండల పరిధిలోని ఇందుపూరు గిరిజన కాలనీకి చెందిన ఇండ్ల రమణమ్మ (47) , తూర్పుగోగులపల్లి హరిజనవాడకు చెందిన గోళ్ళ పోలమ్మ(66)లు మరణించారు. వారి అంత్యక్రియలకు కెఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి సహకారంతో మృతుల కుటుంబ సభ్యులకు మూడు వేల రూపాయల వంతున అందజేశారు. గోళ్ళ పోలమ్మకు ఫ్రీజర్ బాక్స్ ఉచితంగా పంపించడం జరిగిందని ఫౌండేషన్ సభ్యులు జోసఫ్ తెలిపారు.

## దివ్యాంగుల కాలనీలో రోడ్ల నిర్మాణం చేపట్టాలి



**కావలి రూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** కావలి పట్టణ ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని దివ్యాంగుల కాలనీలో వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి , దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు మండవ వెంకట్రావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్లు, డ్రైన్లు, మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దివ్యాంగుల కాలనీ ఏర్పడి దాదాపు 13 సంవత్సరాలైందన్నారు. అప్పటి నుండి పాలకులు, అధికారులు పట్టించుకోకుండా దివ్యాంగులపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి విన్నవించినా, డయల్ యువర్ కార్యక్రమంలో తెలియజేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జనవాసాలు లేని వెంగాయగారిపాళెం రోడ్డును ఆరు నెలల క్రితం తన ప్రైవేట్ లేఅవుట్ కోసం వేయడం దేనికి సంకేతమన్నారు.ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అవసరం వున్న చోట్ల రోడ్లు వేయించుకుంటున్నారని పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివాసాలు వుండే ప్రాంతాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కావలి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటనలు ఇవ్వడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా వర్షాలు పడేలోపు రోడ్లు వేయకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేయడం జరుగుతుందని అధికారులకు మండవ హెచ్చరికలు చేశారు.

## ప్రతిచోటా మంచినీటి కొరతే ఉండరాదు



**కందుకూరు, సెప్టెంబర్12, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ మంచినీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు.కందుకూరు మండలం కోవూరులోని ఎస్టీ కాలనీలో 24లక్షల వ్యయంతోనిర్మించిన మంచినీటి సౌకర్యాన్ని ఆయన ప్రారంభించారు.జలజీవన్ పథకం కింద మంజూరైన నిధులతో ఏర్పాటుచేసిన మంచినీటి పైప్‌లైన్‌ఆయనప్రారంభించారు.ఎస్టీ కాలనీ వాసులు ఇప్పటివరకు ఉప్పునీటినే తాగునీటిగా వినియోగిస్తూ వచ్చారు.అక్కడ పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.తాగునీటి యద్దడి ప్రతిసారీ నెలకొంటూ ఉంది.గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు విజ్ఞప్తితో జలజీవన్ పథకం 24లక్షల రూపాయలు ఎమ్మెల్మే మంజూరుచేయించారు.నాలుగున్నర కిలోమీటర్ల పైపులైన్ ఏర్పాటు చేశారు.సోమవారం ప్రారంభించి ఆ కాలనీ వాసులకు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూనియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ అక్కడ ఉన్న వివిధ కాలనీల్లో సైతం మంచినీరు అందనిచోట కొత్తగా పైపు లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.అందరికీ తాగేందుకు నీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.కాగా వెంకటేశ్వరా ఎస్టీ కాలనీలో కోదండరామస్వామి దేవస్థానానికి సోమవారం ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.శ్రీవాణి ట్రస్ట్ టిటిడి ఆర్థిక సహాయంతో ఆ కాలనీలో దేవాలయ నిర్మాణం జరగనున్నది.పండితులు, గ్రామ పెద్దల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల మాధవ రావు,వైసీపి సీనియర్ నాయకులు కొండూరి వసంతరావు,ఆ గ్రామానికి చెందిన పలువురు నేతలు హాజరైయ్యారు.

## కొడాలి నానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన టిడిపి నేతలు



**కందుకూరు, సెప్టెంబర్12, ప్రభాతవార్త:** బూతులు మాట్లాడే మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిపై కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కందుకూరు టిడిపి నేతలు ఫిర్యాదు చేశారు.మాజీ శాసనసభ్యుడు దివి శివరాం ఆధ్వర్యంలో పలువురు నేతలుకలిసి ఎస్సై కిషోర్‌బాబుకు ఫిర్యాదు చేశారు.కొడాలి నాని ఎమ్మెల్యేగా పనికిరాడని శివరాం అన్నారు.ఇటువంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు.ప్రతినిత్యం బూతులతో చంద్రబాబునాయుడు, కుటుంబ సభ్యులను మాట్లాడే కొడాల నానిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు.నాని ప్రవర్తన బాగలేదని,పద్దతి మార్చుకోకపోతే అదేవిధంగా గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు .పోలీసులు స్పందించి నానిపై కేసు నమోదు చేయకపోతే ప్రజలే తరికి కొడతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోచిపాలత మోషే,చదలవాడ కొండయ్య,షేక్.రఫీ,బెజవాడ ప్రసాద్,చిలకపాటి మధు,వెంకటరమణయ్య,కూనం నరేంద్ర,రెబ్బవరపు మాల్యాద్రి,మహిళా కమిటీ సభ్యులు బత్తిన ఆదెమ్మ,కల్లూరి శైలజ, పిడికిటి లక్ష్మీ, మైనారిటీల నాయకులు షేక్.సలాం,ఫిరోజ్,రసూల్‌బి తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి విరాళం అందజేత



**కందుకూరు, సెప్టెంబర్12, ప్రభాతవార్త:** కందుకూరు పట్టణంలోని అంకమ్మతల్లి దేవస్థాన పున:నిర్మాణానికి సోమవారం పలువురు భక్తులు విరాళం అందజేశారు.నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో కూడా భక్తులు విరాళం అందించి భక్తిని చాటుకుంటున్నారు.సోమవారం ఆలయ ప్రాంగణంలో పలువురు కమిటీ సభ్యులను కలిసి విరాళం అందించారు.బట్టరుశెట్టి శ్రీనుకుటుంబసభ్యులు 25,116లు కానుకగా సమర్పించారు.గుత్తా మాల్యాద్రి దంపతులు బంగారు యంత్రం కొరకు5,121లను అందజేశారు.ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి,ఆవుల మాధవరావు,మాదాల మాల్యాద్రి తదితరలుహాజరైయ్యారు.

## కావలి పోలీస్ స్టేషన్‌లో టిడిపి నాయకులపై కేసు నమోదు

**కావలి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారనే కారణంతో తెలుగుదేశం పార్టీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు కావలి వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. టిడిపి నాయకులు ద్రోణాదుల వాసంతి, ద్రోణాదుల వెంకట్రావు, జ్యోతిబాబురావు, అన్నపూర్ణ శ్రీను, మలిశెట్టి వెంకటేశ్వర్లు, ఏగూరు చంద్రశేఖర్, గుత్తికొండ కిషోర్, చవల రామకృష్ణ, పసుపులేటి నారాయణ, తదితర నాయకులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

## రైతుల యాత్రను జయప్రదం చేయండి

**కందుకూరు, సెప్టెంబర్12, ప్రభాతవార్త:** రాజధాని రైతుల రెండవ యాత్రకు సంఘీబావం తెలుపుతున్నట్లు నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు గోచిపాతల మోషే అన్నారు.త్వరలో ఆ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు చెప్పారు.అమరావతి నుంచి అరసవల్లి వరకు జరిగే మహాపాదయాత్రకు తెలుగుదేశం నేతలు పూర్తిస్థాయిలో సంఘీభావం ఉందని వెల్లడించారు.వైయస్ జగన్ మోహన్‌రెడ్డికి రైతుల ఉసురు తగులుతుందని చెప్పారు.వేలాదిమంది రైతులను రోడ్డున పడేశారని పేర్కొన్నారు.ఈ రైతుల పాదయాత్ర విజయవంతం కావాలని కోరారు.

## చేజర్ల పరామర్శలు



**కోవూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామంలోని లక్ష్మీనారాయణ పురంకు చెందిన టీడీపీ నాయకులు పి. నాగరాజు, వంశీల తండ్రి పి. సుబ్బారావు ఇటీవల మృతిచెందారు. సోమవారం వారి కుటుంబ సభ్యులను జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలోనే గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు శ్రీహరి, వెంకటేశ్వర్లు, విజయ్, మస్తాన్, తదితరులు ఉన్నారు.

## హరనాధపురంలోని సమస్యలు పరిష్కరించండి

**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని హరనాధపురం ప్రాంతానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేషన్ కమిషనర్‌కు సోమవారం మండల అధ్యక్షులు కటకం చైతన్య, ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ గౌడ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు నగరంలో నడిబొడ్డున ఉన్న హరనాధపురం ప్రాంతం ఎన్నో ఏళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోక రోజు రోజుకు మురికి బస్తీగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో 2, 3, 4 ప్రధాన వీదులను కలిపే అడ్డరోడ్డు సైడ్ కాలువలు లేక ఇళ్లలోంచి వచ్చే మురికి నీరు మొత్తం ఆ రహదారిపై పారుతూ ఉండడంతో ఆ ప్రాంతమంతా బురదమయమై దుర్గంధం వెదజల్లుతుందని, దానికి కారణమైన దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజలకు వైరల్ జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు వేయడం, మురికినీరు, పారిశుధ్యం సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు తిరకాల శివ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు కరణం భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి చర్యలు



**సైదాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు పి.కృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు, రహదారి సమస్యలు, తాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## మతిస్థితం లేని మాటలు మాట్లాడితే జాగ్రత్త

**నెల్లూరు సెప్టెంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం :** కొడాలి.నాని జె బ్రాండ్ల మద్యాన్ని తాగి మా నాయకుడైన చంద్రబాబునాయుడు, ఆయన కుటుంబీకులను నీ ఇష్టమొచ్చినట్లు మతిస్థితం లేని మాటలు మాట్లాడితే నీ అంతు చూస్తామని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు టీడీపీ మహిళా అధ్యక్షురాలు పనబాక.భూలక్ష్మి హెచ్చరించారు. సోమవారం నగరంలోని ఆమె నివాసంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ అధినేత జగన్ ప్రతిపక్షాన్ని విమర్శించమన్నారు కదాని ఒక సైకోలాగా నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఇంట్లోని మహిళలను అవమానకరంగా మాట్లాడితే నీకు తగిన బుద్ధి చెపుతామని ధ్వజమెత్తారు. నీకు రాజకీయ భిక్ష పెట్టిన తెలుగుదేశం పార్టీని, ఎన్టీరామారావు కూతురు భువనేశ్వరి, చంద్రబాబునాయుడు, లోకేష్‌లను నోటికొచ్చినట్లు మాట్లాడితే నీకు పుట్టగతులుండవని పనబాక శాపనార్ధాలు పెట్టారు. గతంలో మహిళలను అవమానపరిచిన వారు ఎందరో భూస్థాపితం అయ్యారని, అదే తరహాలో కొడాలి.నాని నీ బ్రతుకు కూడా అదోగతి పాలవుతుందని ఆమె అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం ఎక్కడ ఉందని, ఆపార్టీ నాయకులే మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానాన్ని కల్పించారని, ఇకపై భువనేశ్వరి, బ్రాహ్మణిలను కాని విమర్శిస్తే ఎమ్మెల్యే అని కూడా చూడబోమని తెలుగు మహిళలు తగిన శాస్తి చేస్తామని భూలక్ష్మి హెచ్చరించారు.

## మహిళల అభివృద్దే జగన్‌ధ్యేయం



**వరికుంటపాడు, సెప్టంబర్12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వున్న ప్రతి మహిళ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమపదకాలు చేపట్టారని వరికుంటపాడు వైకాపా మండల కన్వీనర్ అంద్రా.బాలగురవారెడ్డి,సొసైటి అధ్యక్షులు కామేపల్లి.వెంకటరత్నం అన్నారు.సోమవారం స్తానిక సొసైటీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి,పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అలాగే వై.ఎస్.ఆర్ కళ్యాణమస్తు,వై.ఎస్.ఆర్ షాదీ తోఫా పదకాన్ని ప్రవేశపెట్టినందుకు సి.ఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.ఈసందర్భంగా వారుమాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రతి వాగ్దాన్నాన్ని నెరవేరుస్తున్నారని నేడు ఎస్.సి,ఎస్.టి,బి.సి,మైనారిటి వర్గాలతో పాటు వికలాంగులు భవననిర్మాణకార్మిక కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలు వివాహం కోసం వై.ఎస్.ఆర్ కళ్యాణమస్తు,వై.ఎస్.ఆర్ షాదీ తోఫా పదకాన్ని తీసుకువచ్చారన్నారు.ఉగయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖరరెడ్డి,నియోజకవర్గ ప్రచారకార్యదర్శి శాంతకుమారి ఆద్దర్యంలో ఆర్హులైన ప్రతి ఆడబిడ్డకు కళ్యాణమస్తు పదకాన్ని అందించాలని కృషిచేస్తామన్నారు.ఈకార్యక్రమంలో మాజీ జట్.పి.టి.సి సభ్యుడు బోగినేని శ్రీనివాసులు,మాజీ మండల కన్వీనర్ గంగవరపు పుల్లయ్యనాయుడు, నాగభూషణం,టి.కొండారెడ్డిపల్లి సర్పంచ్ ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, వైకాపా నేతలుమాగంటి.శ్రీనివాసులు,బాలచంద్ర,కాకి.అంకయ్య,రవితేజ, తేజానిహాంత్ చెన్నారాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ లైన్‌లపైభాగంలో ఫ్లెక్సీలు కట్టొద్దు

**నెల్లూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త-హరనాధపురం:** విద్యుత్ లైన్‌ల పైభాగాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టరాదని, అవి విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడడం తన దృష్టికి వచ్చిందని జిల్లా సూపరిండెంట ఇంజనీర్ కె.విజయకుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లెక్సీలు కట్టే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ తీగల పైభాగాన కట్టడం వల్ల చిన్నపాటి గాలికే తెగి తీగలపై పడుతున్నాయనారు. దీంతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లడమే కాకుండా అత్యవసర విభాగాలయిన ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అలాగే తెగిపడిన ఫ్లెక్లీలను తొలగించడం తమ సిబ్బందికి కష్టతరంగా మారిందని, నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

## కుట్టు శిక్షణ పొందిన మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేత

**కావలి రూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** కావలి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు క్రిష్టారెడ్డి మాట్లాడారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కేంద్రంలో ఒకటిన్నర సంవత్సరంగా దాదాపు 200 మందికి విజయవంతంగా కుట్టు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణ రెడ్డి సామాజిక వర్గానికే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ శిక్షకురాలు మాధవి సహకారం మరవలేనిని తెలిపారు. త్వరలో ఆరవ బ్యాచ్‌కు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి డాక్టర్ కె.మాధవరెడ్డి, ఎన్.ప్రతాప్‌రెడ్డి, టి.రామిరెడ్డి, సి.హెచ్.సుబ్బారెడ్డి, కె.మస్తాన్‌రెడ్డి, బి.రఘుకుమార్‌రెడ్డి, ఎస్.వి.కృష్ణారెడ్డి, కె.మాలకొండారెడ్డి, సి.హెచ్.మాలకొండారెడ్డి, సిహెచ్.శ్రీకాంత్‌రెడ్డి, వెంకారెడ్డి, జయప్రతాప్‌రెడ్డి, కె.రాఘవరెడ్డి, బి.విజయ్‌కుమార్‌రెడ్డి, కె.మహేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## రత్నం మృతిపై నిస్పక్షపాతంగా విచారణ చేయండి



**నెల్లూరు టౌన్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం రాజా ఇండ్ల గ్రామములో నివాసమున్న వడ్డెర కుటుంబానికి చెందిన రైతు పసుపులేటి రత్నం మృతిపై చిత్తూరు డీఆర్వో రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిషన్ నిస్పక్షపాతంగా విచారణ జరిపించి తొందరగా నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని, రత్నం కుటుంబానికి న్యాయం చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నుంచి ఒక బృందంగా ఏర్పడి పెనుమూరు మండలంలోని మృతుడు రత్నం ఇంటి దగ్గరికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నామని తెలిపారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగే వరకు, వడ్డెర వృత్తిదారుల సంఘం మద్ధతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. రత్నం గత 50 సంవత్సరాల నుంచి తన 2.52 ఎకరాల భూమి కోసం భూస్వాములకు అగ్రకులాలకు వ్యతిరేకంగా పోరాడి, చట్టపరంగా న్యాయస్థానంలలో తనకు అనుకూలంగా కేసులో తీర్పు వచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసుల చేతులలో ఓడిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అధికారులతోను, ఇంకొకవైపు భూస్వాములతో అగ్రకులాలతో పోరాటాలు చేసి న్యాయస్థానంలో కేసును గెలుచుకున్న భూస్వాములు అగ్రకులాల వారు బెదిరింపులకు మరొకవైపు అధికారుల ఒత్తిడిలతో మనస్థాపము చెంది చివరకు గుండెపోటుతో పెనుమూరు తహసీల్దారు వారి కార్యాలయంలోనే మృతి చెందడం చాలా బాధాకరమైన ఘటన అన్నారు. ఆ భూమిని ఆయన కుటుంబసభ్యులకు చెందే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రత్నం కుటుంబసభ్యులు ఆ భూమికి సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు తనకు అందజేశారన్నారు. చట్టప్రకారం మొత్తం భూమిని రత్నం కుటుంబానికి అప్పగించాలని, రత్నం కుటుంబసభ్యులకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, చట్టవిరుద్ధంగా నిర్మించిన ఇళ్లను తొలగించాలని, లేని పక్షంలో ఆ స్థలాలకు ప్రత్యేకంగా మార్కెట్ రేటు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం

**ఉదయగిరి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** నియోజవకర్గ కేంద్రమైన ఉదయగిరి ట్యాంకు బండ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సోమవారం ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేకర్‌రెడ్డి ,నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతికుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చి త్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సిఎం థ్యాక్స్ చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఎన్నికల మ్యానిపెస్ట్‌లో ఇచ్చిన హామి మేరకు ఎస్‌సి,ఎస్‌టి,బిసి మైనార్టీ వర్గాలతోపాటు వికలాంగులు,భవన నిర్మాణ కార్మిక, కుటుంబాల పేద ఆడపిల్లలకు వైఎస్ఆర్ కళ్యాణ మస్తు ,వైఎస్ఆర్ షాదితోపా ద్వారా సహాయం చేయడం అభినందనీయమని అన్నారు. అక్టోబర్ 1 నుండి కళ్యాణ మస్తు ,వైఎస్ఆర్ షాదితోఫా పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు.గతంలో ఏప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిపెస్టువోని అమలు చేస్తున్నామని తెలిపారు.ఇప్పటి వరకు 98 శాతం అమలు చేశామని తాజాగా కళ్యాణమస్తు పథకాన్ని కూడా అమలులోకి తెచ్చామని ప్రకటించారు.ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కిరెడ్డి బాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, గురవా రెడ్డి,కామేపల్లి వెంకటరత్నం, తదితరులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## మా నేతల జోలికి వస్తే తరిమికొడతాం



**నెల్లూరు సెప్టెంబర్ 12, ప్రభాతవార్త-వైద్యం:** టీడీపీ నేత చంద్రబాబునాయుడు, లోకేష్‌ల జోలికి వస్తే తరిమి తరిమి కొడతామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని.రమణయ్య, నెల్లూరు మైనార్టీ అధ్యక్షుడు సాభిర్‌ఖాన్‌లు ఎమ్మెల్యే కొడాలి.నానిని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ ఆదేశాల మేరకు వేదాయపాలెం కూడలిలో టీడీపీ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టి, కొడాలి.నాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుట్కా మట్కా నాని పేరు రాష్ట్రంలో నీ ఒక్కడికే సరిపోతుందని అన్నారు. 45 రాజకీయ చరిత్ర కలిగిచ 14 ఏళ్ళు సీఎంగా పనిచేసిన వ్యక్తిని 420 అన్నదానికి, పంచాయతీరాజ్ శాఖమంత్రిగా పనిచేసి ఎన్నో అవార్డులు పొందిన వ్యక్తిని 220గా అన్నదానికి స్వయానా నీ నియోజకవర్గ ప్రజలే నిన్ను ఛీ కొడుతున్నారని అన్నారు. నువ్వు నీతి నిజాయితీగా ఉంటే రోడ్లమీదకి వచ్చి ప్రజల్లో తిరగాలని వారు నానికి సవాల్ విసిరారు. నువ్వు శాసనసభ్యుడిగా ఉన్నావంటే అది టీడీపీ పెట్టిన భిక్షని గుర్తుంచుకోవాలన్నారు. భారతమ్మ అని సంభోధించిన నువ్వు ఏనాడూ రాజకీయాల్లోకి రాని భువనేశ్వరి, బ్రాహ్మణిని ఎందుకు ఏకవచనంతో సంభోదిస్తున్నావని విమర్శించారు. ఒరేయ్ గుట్కా నాని నీమొఖం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావాని అన్నారు. ఆడవాళ్ళని తిడుతూ బూతులు మంత్రిగా పేరు తెచ్చుకున్న నువ్వు, నిన్ను సమర్థిస్తున్న సీఎం ఒక మగాడేనాని ధ్వజమెత్తారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాజకీయ హుందాతనం పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగి టీడీపీ కుటుంబసభ్యులను విమర్శించే స్థాయికి వైసీపీ నేతలు దిగజారిపోయారన్నారు. బస్టాండ్లో శనక్కాయలు అమ్ముకునే బేవార్స్ నాని అని తీవ్రస్థాయిలో తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. మరోసారి మంత్రి పదవి వస్తుందన్న ఆశతో చంద్రబాబు, లోకేష్‌లను తిడితే తరిమి తరిమి కొడతామని హెచ్చరికను జారీ చేశారు. తల్లి, చెల్లిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసేది జగన్ అని విమర్శించారు. మరోసారి మా నేతలను విమర్శిస్తె ఆంధ్రాని నిన్ను తరిమేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజానాయుడు, ఎం.పెంచలయ్యానాయుడు, కె.వెంకటసాయిబాబా, కె.గంగాధర్, శ్రీనివాసులు, మాతంగి.కృష్ణ, కందిరాజు.వెంకటసుబ్బరాజు, శివాచారి, కప్పిర.రేవతి, వెంకటేశ్వర్లుగౌడ్, బుజ్జమ్మ, ప్రమీల, రాజశేఖర్, సుబ్బన్న, అంకయ్య, చెంచయ్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనుల పరిశీలన

**కలువాయి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మండలంలోని రాజుపాళెం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల గిరిజన కాలనీ నందు జరుగుతున్న మనబడి -నాడు,నేడు అభివృద్ధి పనుల పురోగతిపై క్లష్టర్ రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు మండల విద్యాధికారి జి సురేంద్రబాబు ఆదేశాల మేరకు సోమవారం పాఠశాలను సందర్శించారు. నిధుల వినియోగం త్వరితగతిన పనులు పూర్తి చేయుటకు ప్రధానోపాధ్యాయులు,పేరెంట్స్ కమీటి సభ్యులకు సూచనలు అందించారు. అదే విధంగా జగనన్న విద్యాకానుక,కిట్లు పంపిణీ,బయోమెట్రిక్ నమోదు వివరాలు పరిశీలించి నూరు శాతం బయోమెట్రిక్ నమోదు పూర్తి చేయాలని ఈ సందర్బంగా తెలియజేశారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరి, పేరెంట్స్ కమీటి సభ్యులు పాల్గోన్నారు.

## కలెక్టరేట్ వద్ద కండలేరు మత్స్యకారుల ధర్నా

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** జిల్లాలోని కండలేరు జలాశయానికి సంబంధించిన ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొమరగిరి చెంచయ్య ఆయనకు మద్దతిస్తున్న గిరిజన సంఘనేత కేసీ పెంచలయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కండలేరు జలాశయ మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాదిగ సంఘనేతలు పందిటి సుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ కండలేరు జలాశయం పరిధిలో 500 మందికిపైగా నిరుపేద ఎస్సీ ఎస్టీ జాలర్లు వుండగా కొమరగిరి చెంచయ్య గౌరవ న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించి అర్హులైన పలువురిని సొసైటీలో చేరకుండా చేశారని బయట ప్రాంతాలకు చెందిన 300 మంది గిరిజనులకు సొసైటీలో అక్రమంగా సభ్యత్వం ఇప్పించాడన్నారు. సొసైటీ మొదటి చైర్మన్ మాదిగ కులానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ గిరిజనులు మాత్రమే చేపలు పట్టాలంటూ మాదిగలను బెదిరించడం, వారి కడుపులు కొట్టడం చేస్తున్నాడన్నారు. కొమరగిరి చెంచయ్య తమపూ చేస్తున్న అత్యంత దుర్మార్గాలకు గిరిజన సంఘనేతగా చెప్పుకుంటున్న కేసీ పెంచలయ్య సహకరిస్తున్నారన్న వారు తక్షణమే ఇద్దరిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొమరగిరి చెంచయ్యను చైర్మన్ పదవి నుండి తప్పించాలని తమకు న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు నినాదాలు చేసిన కండలేరు జలాశయ నిర్వాసితులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో జేసీకి అందజేశారు.

## ముంపువాసులకు ఉద్యోగాలివ్వాలంటూ ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** కండలేరు జలాశయం కారణంగా నిర్వాసితులయిన తమకు నిబంధనల మేరకు ఇవ్వాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలు ఇకనైనా ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండలేరు జలాశయ నిర్మాణం కారణంగా 22 గ్రామాలు ముంపుకు గురికావడం, 5,494 కుటుంబాలు నిరాశ్రయులు కావడం జరిగిందన్నారు. జిఓ 98 తేదీ 15.04.86 మేరకు నిర్వాసితులైన ప్రతి కుటుంబంలో ఒకిరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాల్సివుండగా పలు దఫాలుగా కొంతమందికే ఆ మేరకు ఉద్యోగాలివ్వడం జరిగిందన్న వారు మిగిలినవారికి తక్షణమే ఉద్యోగాలివ్వాలన్నారు. ఒక్కో ప్రాజెక్ట్‌కు సంబందించి ఒక్కో విధంగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటుండడంతో తాము నష్టపోతున్నామన్న నిరుద్యోగులు కండలేరు జలాశయానికి సంబందించి తక్షణమే నిరుద్యోగుల సీనియారిటీ జాబితా ప్రకటించి తమకు ఉద్యోగాలు ఇప్పించాలన్నారు. ఈ మేరకు నినాదాలు చేసిన వారు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో జేసీకి అందజేశారు.

## పార్టీమారే ప్రసక్తేలేదు



బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త ఇటీవల తాను వైసిపి నుండి తెలుగుదేశం పార్టీలోకి వెళుతున్నట్లు ప్రసారమాద్యమాలలో ప్రచారం జరుగుతుందని వైసిపి నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు.యర్రంరెడ్డి స్వగృహంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు నేను ఎప్పటికి పార్టీ మారే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.2024 ఎన్నికలలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తానని అన్నారు. కొంతమంది అనుచరుల ఇండ్లకు పరామర్శించడానికి వెళ్లడం జరిగిందని ,మంతనాలు జరపడానికి కాదని చెప్పారు. అనంతరం వవ్వేరు బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు పొర్లుకట్టలకు 80 కోటు ంల మంజూరు అయిందని అంతా అవినీతి జరిగిందని విమర్శలు చేస్తు న్నారని వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు చెప్పారు.పొర్లకట్టలకు అన్ని నిదులు మంజూరు కాలేదని స్పష్టం చేశారు.వాస్తవాలు తెలుసుకోకుండా మీడియాలో హైలెట్ కావలని మాట్లాడుతున్నారని విమర్శిం చారు.సంగం బ్యారేజి ప్రస్తావన చేసేందే ప్రసన్నకుమార్‌రెడ్డి అని అన్నారు.వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు. అనంతరం మండపార్టీ మాజీ అద్యక్షులు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతు టిడిపి పని అయిపోయిందని ఎద్దేవ చేశారు. తెలుగుదేశం నాయకులు తమకు నాయకుడు లేక గోవర్ధన్‌రెడ్డి తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు వేశారు.వైసిపి నాయకులందరు ఎంతో ఐకమత్యంతో ఉన్నామని ,మామద్యలో ఎటువంటి విబేధాలు లేవని అన్నారు.ఐకమత్యంతో పార్టీని ముందుకు నడిపిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, జొన్నవాడ దేవస్దానం ఛైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, మేనకూరు సీతారా మిరెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి,మైనార్టీ నాయకులు షేక్ అల్లాబ క్షు,ఇన్నమూరి నరసింహరావు,మోర్ల మురళీ,చెర్ల ప్రసాద్‌యాదవ్,పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య,డాక్టర్ అల్లాబక్షు,పలువురు వైసిపి నాయకులు పాల్గోన్నారు.

## బుచ్చి తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ప్రమీల



**బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారుగా ప్రమీల సోమవారం బాద్యతలు స్వీకరించారు.బదలీఅయిన తహసిల్దారు శ్రీనివాసరావు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాసరావు అతికొద్దికాలం బుచ్చిలో పనిచేసిన వేలాది మందికి ఇళ్ల స్దలాలు పంపిణి చేసే కార్యక్రమంలో కీలక పాత్ర వహించారు.పలువురు చేత ప్రశంసలు అందుకున్నారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.అనంతరం తహసిల్దారు ప్రమీల మాట్లాడుతు తహసిల్దారు శ్రీనివాసరావు కి అందించిన విధంగా తనకు కూడా సిబ్బంది సహకారం అందించాలని ఆమె కోరారు.ఈకార్యక్రమంలో ఆర్ఐ సుధారాణి, సీనియర్ అసిస్టెంట్ కొండలరావు,ఎఎస్ఒ, సిబ్బంది ,విఆర్ఒలు పాల్గోన్నారు.

## కామాక్షితాయి సేవలో తహసిల్దారు ప్రమీల



**బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారిని బుచ్చి నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ప్రమీల దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ పుట్టా సుబ్రమణ్యం నాయుడు,ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆమెను ఆహ్వానించి ఆమె గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది వున్నారు.

## పుట్టిన రోజును పురస్కరించుకొని పేదలకు అన్నదానం

**కావలి రూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో కావలి పట్టణానికి చెందిన వాకాటి శ్రీనివాసులు, సరిత దంపతుల కుమారుడు వాకాటి రోహన్ ఆర్య 13వ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక బుడమగుంట గిరిజన ప్రాంతంలో వంద మంది నిరుపేద గిరిజనులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడుతూ దాతలు శ్రీనివాసులు, సరితలు తమ కుమారుడు పుట్టిన రోజు సందర్భంగా ఎటువంటి ఆడంబరాలకు వెళ్లకుండా, వృధా ఖర్చులు చేయకుండా పేద వారి ఆకలి తీర్చడం సంతోషంగా వుందన్నారు. పుట్టిన రోజు జరుపుకున్న వాకాటి రోహన్ ఆర్యకు సంయుక్త సంస్థ ద్వారా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దాతలు వాకాటి శ్రీనివాసులు, సరిత, రోహన్ ఆర్య,గంగపట్నం సురేంద్ర, పొట్టెయ్యలు పాల్గొని గిరిజనులకు అన్నదానం చేశారు.

## విధుల పట్ల అలసత్వం వద్దు



**కోవూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యే విషయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం ప్రదర్శించకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గృహ నిర్మాణ శాఖకు సంబంధించి నిర్మాణాల విషయమై ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా లబ్దిదారులు కూడా సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టే నిర్మాణాలు కూడా నాణ్యతగా ఉండేలా దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ఏఈ భాస్కర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## సేవతోనే నిజమైన సంతృప్తి కలుగుతుంది



**నెల్లూరు టౌన్, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** సేవతోనే మనిషికి నిజమైన సంతృప్తి కలుగుతుందని కరోనా ఆయుర్వేద వైద్యులు బొనిగి ఆనందయ్య పేర్కొన్నారు. డ్యాటీస్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఛైర్మన్ నూనె వెంగయ్య జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. సోమవారం ఉదయం నెల్లూరు బుజబుజనెల్లూరులోని డ్యాటీస్ కార్యాలయం నందు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొనిగి ఆనందయ్య పాల్గొని మాట్లాడుతూ ఆడంబరాలకు పోకుండా నిరాడంబరంగా ఉండే నూనె వెంగయ్య జన్మదిన వేడుకలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. డ్యాటీస్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఛైర్మన్ నూనె వెంగయ్య మాట్లాడుతూ సంతోషం నలుగురితో పంచుకుంటే రెట్టింపు అవుతుందన్నారు. బాధను నలుగురితో పంచుకుంటే ఆ బాధ తగ్గుతుందన్నారు. అందువలన తనకు అందరితో కలిసిమెలిసి ఉండడం ఆనందంగా ఉంటుందని వివరించారు. అనంతరం పలువురికి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్ రాజు, తెలుగుదేశంపార్టీ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

## విశ్వనాధరావుపేటలో జెడ్పీ హైస్కూలు రోడ్డుకు నిధులు మంజూరు



**బిట్రగుంట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని ఇబ్రహీంపేట నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో అధ్వానస్థితిలో వున్న రోడ్డును సిసి రోడ్డుగా మార్చి రోడ్డు నిర్మాణం, డ్రైనేజి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. విశ్వనాధరావుపేట పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి వృద్దులకు, వితంతువులకు వాలంటీర్ల ద్వారా పెన్షన్ల పంపిణీ, ఇతర పథకాల అమలు వంటి అంశాలపై ఆరా తీశారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాత వాలంటీర్ల ద్వారా లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. గత మూడు సంవత్సరాలుగా సంక్షేమ కార్యక్రమాలతో పాటు గాడితప్పిన పరిపాలనను సరిదిద్దారని తెలిపారు. మరో రెండేళ్ళలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మళ్లీ ఆశీర్వదించమని మీ వద్దకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, గ్రామ సర్పంచ్ గందూరు మంజుల, ఎంపిటిసి సభ్యులు మద్దిబోయిన పద్మ, ఎ.కె.సుందర్‌రాజ్, మండల పార్టీ కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, నేతలు గందూరు శ్రీనివాసులు,మేకల శ్రీనివాసులు, మద్దిబోయిన శేఖర్, ఎస్.కె.షమీవుల్లా, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**బిట్రగుంట,సెప్టంబర్12,ప్రభాతవార్తః** రాష్ట్ర ముఖ్యంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్.సి,ఎస్.టి,బి.సి దివ్యాంగులకు,యువతీ యువకులు వివాహం చేసుకునేందు కు వై.ఎస్.ఆర్ కళ్యాణమస్తు పదకాన్ని ప్రవేశపెట్టినందుకు ఆయనకు కృతగ్నతగా విశ్వనాధరావుపేట సర్పంచ్ గండూరి.మంజుల ఆద్వర్యంలో సచివాలయ సిబ్బంది వార్డు సభ్యులు,వార్డు వాలంటీర్లు,ఎం.పి.టి.సి సభ్యులు సోమవారం పాలాభిషేకం నిర్వహంచారు.ఈకార్యక్రమంలో ముఖ్యఅతిదిగా పాల్గొన్న ఎం.ఎల్.ఎప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పదకాలనుండి అన్నివర్గాలకు ఆదరణ లభిస్తుందన్నారు.ఎన్నికల హామీలు 98శాతంకు పైగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.మండల పార్టీ కన్వీనర్ ఎం.వీరరఘు మాట్లాడుతూ కావలిలో ఎం.ఎల్.ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేసే అభివృద్ధినిచూసి ఓర్వలేకగత ప్రభుత్వంలో బన్మభూమి కమిటీ పేర్లతో కోట్లాదిరూపాయల నిధులు స్వాహాచేసిన నేతలు విమర్శించడంలో అర్దంలేదన్నారు.ఈకార్యక్రమంలో నేతలు గండూరు. శ్రీనివాసులు,మేకల.శ్రీనివాసులు,జట్.పి.టి.సి మద్దెబోయిన కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ మళ్ళీ జగనన్నే రావాలి



**జలదంకి,సెప్టంబర్12,ప్రభాతవార్తః** పదకాల ప్రధాత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి,ఉదయగిరి ఎం,ఎల్.ఎగా మేకపాటి చంద్రశేఖరరెడ్డిలను మళ్ళీ,మళ్ళీ తిరిగి గెలిపించుకొందామని మండల వై.సి.పి కన్వీనర్ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు.వై.ఎస్.ఆర్ కళ్యాణమస్తు పదకాన్ని ప్రవేశపెట్టిన సందర్బంగా సోమవారం మండలకేంద్రమైన జలదంకిలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు 98శాతంపైగా నెరవేర్చిన ఘనత మన సింయం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.నవరత్నాలు ఎంతో పకడ్బందీగా అమలు పరచి రాష్ట్ర ప్రజల మనసులు దోచుకున్నాడో ఈకళ్యాణమస్తుకూడా ఎస్.సి,ఎస్.టి,బి.సి,మైనారిటీ,కార్మికుల యువతీ యువకులకు ఇది ఒకవరంగా భావించాలన్నారు.అందుకే ఈసారి గతంకంటే అత్యదిక మెజారిటీ వచ్చేవిదంగా మనం కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.మన ఎం.ఎల్.ఎ చంద్రశేఖరరెడ్డి,ప్రచారకార్యదర్శి శాంతమ్మలు ఈకార్యక్రమం చేపట్టమని ఆదేశించినదే తడువుగా ఇక్కడ పాలాభిషేకానికి శ్రీకారం చుట్టామన్నారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పాలవల్లి.మాలకొండారెడ్డి,జట్.పి.టి.సి శివలీలమ్మ,మహిళా నేత తిప్పారెడ్డి.ఇందిరమ్మ ,తిమ్మసముద్రం సర్పంచ్ రావి.ప్రసాద్,కమ్మవారిపాళెం సర్పంచ్ తమ్మినేని.సతీష్,బ్రాహ్మణక్రాక సర్పంచ్ ఇండ్ల.సుధాకర్,సొసైటి ఛైర్మన్ రవిరెడ్డి,నేతలు వట్టికాళ్ళ.బాలయ్య,గుమ్మిడి.రమేష్, జ్యోతి.రామచంద్రయ్య, డాకా.గోపాల్‌రెడ్డి,జలదంకి సర్పంచ్‌అనూరాధ ,వల్లంరెడ్డి.నరసారెడ్డి తదితరులుపాల్గొన్నారు.అందకు ముందు దివంగత ముఖ్యమంత్రి మహానేత వై.ఎస్.ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

## కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**కోవూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ప్రజలను ప్రమాదాల నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శేషయ్య తెలిపారు. కోవూరులోని చెరువు సమీపంలో ఉన్న సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం గుండా నిత్యం గుమ్మలదిబ్బ, పాటూరు, యల్లాయపాలెం, దామరమడుగు, రేబాల , బుచ్చి వైపు ఎంతో మంది కార్మికులు, వ్యవసాయ కూలీలు వ్యాపారస్తులు వెళ్తుంటారని, వర్షాకాలం సమయంలో ఈ కలుజుపై నీరు పారి ప్రయాణానికి ఆటంకం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవ తీసుకుని కలుజుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్కే బాబు, పి. సురేంద్ర, మల్లికార్జున్‌రెడ్డి, గాఓవర్ధన్, సురేష్, ఖాన్‌బాషా, భాస్కర్, రమేష్, తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయునికి సన్మాన సభ



**సైదాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాల నందు ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న మేదూరు కుమార్‌ను ఆదివారం గూడూరు నందు ప్రగతి సేవా సంస్థచే ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన నేపథ్యంలో సోమవారం మర్లపూడి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఛైర్మన్ వెంకురెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చలపతి తదితరులు పాల్గొన్నారు.

## గేమ్ డిజైనింగ్‌పై విద్యార్థులు దృష్టి



**కోవూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గేమ్ డిజైనింగ్ యూజింగ్ బిల్డ్ బాక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించడం ప్రశంసనీయమని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గేమ్ డిజైనింగ్ యూజింగ్ బిల్డ్ బాక్స్ అనే అంశంపై పాలిటెక్నిక్ కళాశాల ఈసీఈ విద్యార్థులకు చేపట్టిన శిక్షణా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రణాళికా అధ్యయనం, సునిసిత నైపుణ్యంగల విద్యార్థులు తమ కళాశాలలో ఉండడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేలా విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మహేంద్రబాబు, ఈసీఈ విభాగాధిపతి కె. శ్రావణకుమారి, కోఆర్డినేటర్ శ్రీమాలిన్, ఐఐసీసీ విభాగాధిపతి పి. చక్రపాణి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు సతీష్‌కుమార్ ,గౌస్ పీర్, తదితరులు ఉన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

## భాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి

**వింజమూరు, సెప్టంబర్12,ప్రభాతవార్తః**గ్రామ సచివాలయాలలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ అత్యుత్తమ సేవలు అందించాలని ఎం.పి.డి.ఒ వి.స్వరూపారాణి పేర్కొన్నారు.సోమవారం మండలంలోని చాకలి కొండ,కాటేపల్లి,ఊటుకూరు,వింజమూరు 5 గ్రామ సచివాలయాలలో సిబ్బంది,వాలంటీర్లతో సమావేశమయ్యారు.ఈసమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతి సంక్షేమపదకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలన్నారు.ప్రభుత్వ పదకాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించడంతోపాటు ప్రజాసేవే పరమావదిగా పనిచేయాలన్నారు.ప్రతి కుటుంబానికి సంబందించి అర్హత కలిగావుండికూడా ప్రభుత్వ సంక్షేమ పదకాలలో వారిని భాగస్వామ్య కల్పించకుండావుంటే తక్షణం అర్హులకు వర్తించే పదకాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు.ప్రభుత్వం ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పదకాలను ప్రవేశపెట్టి వాటిని క్షేత్రస్తాయిలోఅందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.విధులను భారంగా భావించి పనులను విశ్మరించే పక్షంలో స్వఛ్చందంగా పదవీవిరమణ చేయాలని ఆమె హితవు పలికారు.అం తేకాని పనిచేయకుండా సచివాలయాలకు హాజరుకాకుండా విధులకు ఎగనామం పెడితే ఉపేక్షించమన్నారు.ఈసమావేశంలో వివిధ సచివాలయాల కార్యదర్శులు ఒగ్గు.శీనయ్య,బి.శ్రీనివాసులురెడ్డి,పెంచలయ్య,తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలి



**వింజమూరు,సెప్టంబర్12,ప్రభాతవార్తః** వింజమూరు పాతూరు ప్రాంత వాసులకు సంబందించిన స్మశానానికి దారి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలని భారతీయ జనతాపార్టీ ఆద్వర్యంలో ఆర్య వైశ్య సంఘం నేతలు సోమవారం తహసిల్దార్ చొప్పా.రవీంద్రబాబుకు కార్యాలయంలో వినతిపత్రం అంద జేశారు.ఈసందర్భంగా మాజీ జట్.పి.టి.సి సభ్యులు పులిచర్ల వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ పాతూరు స్మశానంకు వెళ్ళాలంటే కిలోమీటర్‌దూరం నిడివి కలదన్నారు.ఎవరైనా మరణిం చిన సమయాలలో ఆప్రాంతంకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా వుందన్నారు.ఇప్పటికే పలుమార్లు పాతూరుకు చెందిన ప్రజలు అదికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించడం జరిగిందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలన్నారు.ఈకార్యక్రమంలో బి.జె.పి పార్టీ మండల అధ్యక్షులు దేగా మదుయాదవ్,ఆర్యవైశ్య మండలశాఖ అధ్యక్షులు చవల.సత్యన్నారాయణ,ఇతర ఆర్యవైశ్య సంఘనేతలు బి.జె.పి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ప్రజల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



**వింజమూరు,సెప్టంబర్12,ప్రభాతవార్తః** రాష్ట్రంలోని ప్రతివక్క సామాజిక వర్గం ప్రజల అభ్యున్నతే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్ష్యమని వై.ఎస్.ఆర్.సి.పి మండల కన్వీనర్ రేవునూరి.శ్రీనివాసులరెడ్డి,ప్రాదమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్షన్ జూపల్లి.రాజారావు,సర్పంచ్ నల్లగొండ్ల.సృజన పేర్కొన్నారు.సోమవారం స్తానిక బంగ్లా సెంటర్ కూడలిలో వై.ఎస్.ఆర్ విగ్రహంవద్ద వై.ఎస్.ఆర్ కాంగ్రేస్‌పార్టీ నేతలు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్.సి,ఎస్.టి,బి.సి,మైనారిటి,భవనకార్మిక కుటుంబాలకు వై.ఎస్.ఆర్ కళ్యాణమస్తు పదకం,సాదితోఫా పదకం ప్రవేశపెట్టిన సందర్బంగా ఉదయగిరి ఎం.ఎల్.ఎ మేకపాటి.చంద్రశేఖరరెడ్డి,నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంతకుమారి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈసందర్బంగా వై.సి.పి నేతలు మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలోకూడా మనరాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమపదకాలు ప్రజారంజక పాలన జరుగుతున్నాయన్నారు.చరిత్రలో కనీ,విని ఎరుగని రీతిలో ప్రజాసంక్షేమ పదకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నూటికి నూరుశాతం అమలు పరుస్తూ నాటిదివంగత ముఖ్యమంత్రి వె.ఎస్.ఆర్‌పాలనను అక్షరములా ప్రజలకందిస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల హృదయాలలో సుస్తిరస్నానం సంపాదించుకున్నాడన్నారు.అలాగే ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖరరెడ్డి,ప్రచారకార్యదర్శి శాంతికుమారిలు జగనన్న పాలనలో నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగని విధంగా ప్రజలకు సంక్షేమం అబివృద్ధి ఫలాలను అందిస్తూ ఈప్రాంత వాసుల్లో గూడు కట్టుకొని పోయారన్నారు.ఇటీవల నియోజకవర్గంలో వివిద మండలాలలో చేపట్టిన గడప,గడపకు కార్యక్రమం ప్రజలు ఆదరిస్తున్న తీరు అమోఘమ న్నా రు.ఈప్రాంత అభివృద్ధి మేకపాటితోనే సాద్యమన్నారు.ఈకార్యక్రమంలో కాటేపల్లి ఎం.పి.టి.సి పి.పురు షోత్తం,నీలపు సంజీవరెడ్డి, మండాది.గోవిందరెడ్డి,భోజనపు.గోపి,అన్నపురెడ్డి.శ్రీని వాసులురెడ్డి, కొండపల్లి.రమేష్ నాయుడు,కె.రాజు,బి.ఆనంద్,ఆనంగి శీనయ్య,మురళి,మహిళానాయకురాలు వాణి,మ ద్దూరి.బాలకృష్ణ,ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్‌డే




**కావలి రూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని రవీంద్ర పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ కె.అర్చన ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్‌డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అర్చన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ ఎంతో సంతోషంగా పాల్గొన్నారన్నారు. విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన ఎంఎస్ఆర్ విద్యార్థి



**కావలి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** కావలి పట్టణ కోఆపరేటివ్ కాలనీలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో బిఎ చదువుతున్న విద్యార్థి బండ్ల మోహన్‌కృష్ణ సౌత్ జోన్ నేషనల్ గేమ్స్‌లో 100 మీటర్ల రిలేలో గోల్డ్ మెడల్ సాధించాడు. సెప్టెంబరు 9 నుండి 11 వరకు గుంటూరులో జరిగిన క్రీడల్లో మోహన్‌కృష్ణ ఈ పతకం దక్కించుకున్నాడు.నేషనల్స్‌కు రావడానికి ముందు ఆగస్టు 28 నుండి 30వ తేది వరకు గుంటూరులో జరిగిన సౌత్‌జోన్ స్టేట్ మీట్‌లో 100 మీటర్స్‌లో కూడా సిల్వర్ పతకం సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్ కుమార్‌చౌదరి, ప్రిన్సిపాల్ తల్లపనేని ఉమ, వ్యాయామ అధ్యాపకుడు బ్రహ్మానందరెడ్డిలు విద్యార్థి మోహన్‌కృష్ణను అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ తమ కళాశాలలోని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా ఫైనల్ ఇయర్‌లోనే ఉద్యోగాలు సంపాదిస్తున్నారన్నారు. క్రీడల్లో కూడా విశేషంగా రాణిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికి తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో జరగనున్న జూనియర్ నేషనల్స్‌కు ఈ విద్యార్థి సిద్ధమవుతున్నాడని తెలిపారు. దానిలో కూడా పతకం సాధించేలా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

## డ్రైనేజి పూడికతీత పనుల్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**బిట్రగుంట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** బోగోలు మండలం ఇబ్రహీంపేట నుండి బేతనీయపేటకు వెళ్లే మార్గంలో రైల్వేకి సంబంధించిన డ్రైన్‌లో పూడికతీత పనులను సోమవారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు. బేతనీయపేటలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పర్యటించినప్పుడు రైల్వే వారు కానీ పంచాయతీ వారు కానీ డ్రైనేజి కాలువని పట్టించుకోకపోవడంతో తీవ్ర దుర్గంధంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వర్షాకాల సమయంలో డ్రైనేజి పొంగి పల్లపు ప్రాంతాలైన తమ నివాసాల్ని ముంచెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ డ్రైనేజి కాలువ దుస్థితి గురించి రైల్వే ఎడీఎన్‌తో మాట్లాడి శాశ్వత పరిష్కారం కనుగొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. అప్పటి లోగా స్వయంగా జెసిబితో పూడిక తీత పనులు చేపట్టడమే కాకుండా గ్రావెల్ రోడ్డు వేయిస్తానని ఆ ప్రాంత వాసులకు ఇచ్చిన హామీ మేరకు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే స్పందన

**బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే స్పందన కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలి పారు.స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించా రు. నాలుగో వార్డులో ఇంటి హద్దుం పరిష్కరించాలని కోరుతు అర్జీ స్వీకరిం చారు.మరోకరు ఇంటి స్థలంకావాలని అర్జీసమర్పించారు. ఇంకొక అర్జీదారుడు



కొంతమంది రోడ్డుకి అడ్డంగా పశువులు కట్టివేస్తున్నారని దాని వల్ల చాలా ఇబ్బందిగా ఉందని అన్నారు.అలాగే నాలుగో వార్డులో పిచ్చిమొక్కలు తొలగించి దోమలు రాకుండా మందును పిచికారి చేయించారు .ఈకార్య క్రమంలో కౌన్సిలర్లు పుట్టా ధనలక్ష్మీ, కో ఆప్షన్ మెంబర్ నాగలక్ష్మీ,బట్టాప్రవల్లిక,తదితరులున్నారు.

## కార్యాలయం ముందు దాన్యం పోసి కిసాన్‌మోర్చ నిరసన



**బుచ్చి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** రైతులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని,రైతుల ధాన్యం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్‌మోర్చ ఆద్వర్యంలో నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా కిసాన్‌మోర్చ జిల్లా అద్యక్షులు కాలం బుజ్జిరెడ్డి మాట్లాడుతు ఆరు నెలల క్రితం ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఇంత వరకు నగదు చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేఖ విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని వారు కోరారు. అలాగే రైతుల వద్ద వున్న ధాన్యాన్ని మద్దతు ధరకు ఇవ్వాలని వారు కోరారు.ప్రతి గ్రామంలో కల్లాలు ఏర్పాటు చేయాలని అన్నారు.ఈకార ్యక్రమంలో కిసాన్‌మోర ్చ జిల్లా ప్రధానకార్యదర్శలు చేవూరు వినయ్‌నారాయణ ,గాదిరాజు చక్రవర్తి,వన్నెపంట బాలరాఘవరెడ్డి, సూరి కొండారెడ్డి, బొర్రు అంకయ్య నెల్లూరు సుబ్రమణ్యం, మున్సిఫల్ అద్యక్షులు రామిశెట్టి మోహన్‌బాబు, కాసా శ్రీనివాసులు,మహిళామోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరు నాగవేణి, కోప్పోలు మస్తానయ్య, పెజ్జాయి క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## టిడిపి నుంచి వైసిపిలో చేరిక



**వెంకటాచలం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** వెంకటాచలం మండలంలోని తిరుమలమ్మపాళెం,వెంకటరెడ్డిపాళెం,గ్రామానికి చెందిన టిడిపి పార్టీకి నుంచి 100 కుటుంబాలు ఈపూరు మురళీదర్‌రెడ్డి ఆద్వర్యంలో మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి సమక్షంలో వైసిపి పార్టీ తీర్దం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి పార్టీ కండవ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసే అభవృద్ది సంక్షేమా కార్యక్రమాలకు అకర్షితులైన యువత పార్టీలోకి వచ్చేందుకు మగ్గుచూపుతున్నారు.పార్టీలో చేరికి పార్టీ అండగా ఉంటుందని గ్రామాల అభివృద్దికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని మంత్రి సూచించారు. తిరుమలమ్మపాళెం వైసిపి నాయకలు ఏడుకోండలు వెంకటరెడ్డిపాళెం వైసిపి నాయకులు పాల్గోన్నారు.

## కావలి యూనియన్ బ్యాంక్ మేనేజర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**కావలి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** బ్యాంక్ ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కావలి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మస్తాన్‌బాబుపై కావలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బిజెపి నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం యూనియన్ బ్యాంక్ ఎదుట కావలి పట్టణ బిజెపి అధ్యక్షులు కుట్టుబోయిన ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు బ్రహ్మానందం మాట్లాడారు. బ్యాంక్ ఖాతాదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మేనేజర్ మస్తాన్‌బాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులకు అందిస్తున్న సబ్సిడీ లోన్లు మంజూరు చేయడంలో మేనేజర్ మస్తాన్‌బాబు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రశ్నించిన ఖాతాదారులను మోడీనే లోన్లు ఇవ్వమని నిర్లక్ష్యంగా, బాధ్యతాయుతంగా సమాధానంగా చెబుతున్నాడన్నారు. ఈ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కావలి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80 కోట్ల అవినీతి ఆరోపణలపై కాణిపాకం ఆలయంలో ప్రమాణానికి సిద్ధం



**కోవూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఇరిగేషన్ పనుల్లో 80 కోట్ల రూపాయలు అవినీతి చోటుచేసుకుందని కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన అవినీతి ఆరోపణలపై కాణిపాకం వినాయక స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు తాము సిద్ధమేనని , పోలంరెడ్డి రావాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి సవాల్ విసిరారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఉనికి కాపాడుకునేందుకే పోలంరెడ్డి విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇప్పటికే ప్రజలు తెలుగుదేశం పార్టీని ఛీకొట్టి మూల కూర్చోబెట్టారని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ పూర్తిగా కనుమరుగయిపోవడం కాయమని ధీమా వ్యక్తం చేశారు. కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డిపై పోలంరెడ్డి అసత్య ఆరోపణలు, బెదిరింపు ధోరణిలో హెచ్చరించడం వైసీపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాటకు మానిఫెస్టోలోని పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందాయో లేదో తెలుసుకుంటున్న మా ఎమ్మెల్యేపై పోలంరెడ్డి మాట్లాడడం దారుణంగా ఉందన్నారు. ఒకవైపు ఆరోగ్యం సహకరించకపోయినా ఇప్పటివరకు 12 వేల ఇళ్ల ప్రసన్నకుమార్‌రెడ్డి తిరిగారన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి నాలుక కోస్తాం, అంతు చూస్తామని పోలంరెడ్డి బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్యవాదు లంతా తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. గత తెలుగుదేశం పాలనలో ఐటీ శాఖ మంత్రిగా ఉన్న లోకేష్‌బాబు ఏపీ ఫైబర్‌నెట్‌కు సంబంధించి సీసీ కెమెరాలు , రూటర్‌లు, తదితర వాటి కొనుగోళ్లలో కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడ్డారని, ఈ విషయమై దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి అసెంబ్లీలో కూడా దీనిపై చర్చను లేవదీసి సీబీఐ విచారణ చేపట్టాలని ఆదేశాలు కూడా ఇచ్చారన్నారు. బయట మార్కెట్‌లో 2 వేల రూపాయలకు దొరికే సెట్‌టాప్ బాక్స్‌ను ఈ ప్రబుద్ధులు రూ.4400కి కొనుగోలు చేశారని, ఇందులో భారీ అవినీతి కూడా చోటు చేసుకుందని, ఇందుకు ప్రధాన సూత్రధారి టెస్లాసాప్ అధినేత వేమూరి హరిప్రసాద్ అని అన్నారు. ఆయన లోకేష్‌బాబుకు మంచి సన్నిహితుడు అన్నారు. అటువంటి లోకేష్‌బాబును ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శిస్తే తప్పేమిటన్నారు. ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ 2003వ సంవత్సరంలో మా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పక్కనే ఉండి అప్పట్లో రాపూరులో మీపై దాడి చేయబోతే కాపాడింది ప్రసన్నకుమార్‌రెడ్డి కాదా అని అన్నారు. ఏదో లక్ష్మీపార్వతి పుణ్యమా అంటూ రూపాయి డబ్బులు వెనకేసుకున్న పోలంరెడ్డి నిజాయితీగా కరోనా సమయంలో కూడా ప్రజల మధ్యలో ఉండి వారి యోగక్షేమాలు తెలుసుకున్న మా ఎమ్మెల్యేను విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా నీ భాష మార్చుకుని బుద్ధిగా ఉండకపోతే ప్రజలే నిన్ను తరిమికొట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, యువజన విభాగం అధ్యక్షుడు ఎం. చిరంజీవి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కె. ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## ప్రియదర్శిని లైయన్స్ క్లబ్ వితరణ

**నెల్లూరు సెప్టెంబర్ 12, ప్రభాతవార్త– వైద్యం** నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభు త్వ పెద్దాసుపత్రికి సోమవారం ప్రియదర్శిని లైయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారు పెద్దా సుపత్రికిరోగుల కోసం వీల్‌ఛైర్‌తో పాటు స్ట్రెచ ర్,గర్భిణీలకు చెప్పులు,పురిటి బిడ్డలకు బట్టలు , బిస్కెట్ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న ప్రభు త్వ మెడికల్ కాలేజ్, పెద్దాసుపత్రి అబి .వృద్ధి కమిటీ కోఆర్డినేటర్ కాకుటూరు. లక్ష్మీ సునంద చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌లో మహిళా వింగ్ ప్రియదర్శిని లయన్స్ క్లబ్ వారు పెద్దాసుపత్రిలో ఇప్పటి వరకు తల్లిపాల వారోత్సవాలను పురస్క రించుకుని డ్రస్సులు, పండ్లు అందచేశారని వివరించారు. అలాగే జూలై 1న వీల్‌ఛైర్ కూడా అందించారని, ప్రస్తుతం డ్రస్సులు, చెప్పులు, స్ట్రెచర్, వీల్‌ఛైర్ అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రియదర్శిని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సువర్ణ.శేషాద్రి, అఖిల, అనుమాలలు మాట్లాడుతూ నిరుపేద రోగులు వచ్చే పెద్దాసుపత్రికి తమ క్లబ్ తరపున ప్రతి నెలా తమకై చేతనైనంత సహాయం అందిస్తామని తెలిపారు. ఆ క్లబ్ కోశాధికారి కళ్యాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.



## సాధారణ కాన్పుల సంఖ్య పెరిగేలా చర్యలు




**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** ప్రభుత్వాసుపత్రులలో అందిస్తున్న వైద్యసేవలపై గర్భిణీలకు అవగాహన కల్పించి..సాధారణ కాన్పుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ వైద్యాధికారులు, సీడీపీఓలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రులలో కాన్పులు. కోవిడ్ వ్యాక్సీనేషన్, పౌష్టికాహారం పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, సీజనల్ వ్యాధులపై ఆయన కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వైద్యఆరోగ్యశాఖ–స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు–ఆశా కార్యకర్తలు గర్భిణీలను గుర్తించి ఆరోగ్యభద్రతకు సంబందించి ప్రభుత్వాసుపత్రులలో కాన్పులు చేసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తూ రక్తహీనత రాకుండా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి వారికి కాన్పు సమయంలో మెరుగైన చికిత్స అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేకయాప్ ద్వారా చిన్నారుల హాజరును నమోదు చేయాలన్న జేసీ సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలన్నారు. కాగా ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ ఉమామహేశ్వరి, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాధ్, జీజీహెచ్ సూపరెండెంట్ సిద్దానాయక్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మతోపాటు సీడీపీఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దాసుపత్రిలో క్యాన్సర్ వైద్య సేవలు



**నెల్లూరు సెప్టెంబర్ 12, ప్రభాతవార్త–వైద్యం** దర్గామిట్టలోని గవర్నమెంటు జనరల్ ఆసుపత్రిలో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స సేవలను తొలి సారిగా ప్రారంభించామని రేడియేషన్ అంకాలజిస్ట్, క్యాన్సర్ విభాగ హెచ్ఓడి డాక్టర్ రమేష్ తెలిపారు. సోమవారం మరో రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ పద్మావతితో కలిసి ఆసుపత్రిలో జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతానికి ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. రోగు లు పెరిగేకొద్దీ ప్రతిరోజూ ఓపీ సేవలుంటాయాన్నారు. క్యాన్సర్ నిర్ధారణకు పాప్ స్మియర్, బయాప్సీ, ఎఫ్ఎన్ఏసీ లాంటి నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము, నోటి కాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, లింఫ్ గ్రంధుల గడ్డల క్యాన్సర్ తదితర అన్ని రకాల క్యాన్సర్లకు చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా క్యాన్సర్‌కు సంబంధించిన వైద్య సేవలు అందిస్తుమని వెల్లడించారు. అత్యంత నిపుణులైన డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రభుత్వం జీవో ప్రకారం 30 పడకల క్యాన్సర్ విభాగాన్ని మంజూరు చేసిందని, అందుకు అనుగుణంగా రోగులకు చికిత్సా చర్యలు చేపట్టామని చెప్పారు. త్వరలోనే కీమో థెరపీ కూడా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెద్దాసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు ఇప్పటి వరకు ప్రజలకు తెలియదని ఇప్పుడు చికిత్సలను వినియోగించుకుని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం పొందాలని కోరారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన క్యాన్సర్ పరీక్షలు చికిత్సలు చేసేందుకు ఇక్కడ మహిళా డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఆత్మకూరు ట్రెజరీ భవనం ప్రారంభం



**ఆత్మకూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** ఆత మ్కూరు పట్టణంలో నూతన ఉపఖజానా కార్యాలయాన్ని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తాను శాసనసభ్యులుగా ఎన్నికైన తరువాత మొదటగా ఈ భవనాన్ని ప్రారంబించడం సంతోషంగా ఉందని అన్నారు. ఆత్మకూరు పట్టణంలో బ్రిటీష్ కాలం నాటి 110 సంవత్సరాల చరిత్ర గలిగిన ఉపఖజానా కార్యాలయం పురాతన భవనంలో ఉందని అన్నారు. తమ సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చొరవతో ఈ కార్యాలయానికి సంబంధించి పనులు వేగవంతమై పూర్తి స్థాయిలో భవనం నేర్మించబడడం జరిగిందని అన్నారు.తహసిల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఈ భవనాన్ని నేర్మించారు. ఈకార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి టి గంగాద్రి, స్థానిక ట్రెజరీ కార్యాలయ అధికారి ఎన్‌వి రవికుమార్,ఉపఖజానా కార్యాలయ అధికారులు డి రమణారెడ్డి లోకేషబాబు,డి కిరణ్ ప్రసాద్‌బాబు, సుప్రియ,స్థానిక ప్రజాప్రతినిదులు,అని ్న శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిఎం చేతుల మీదుగా త్వరలో మత్యకారతరే ప్యాకేజి



**ముత్తుకూరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అక్టోబర్ మాసంలో మత్యకారేతర ప్యాకేజిని పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయశాకామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్దానిక వైసిపి కార్యాలయంలో విలేఖర్ల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు పార్టీ అధికారంలోకి వస్తే తెల్లరేషన్‌కార్డు కలిగి వున్న లబ్దిదారులందరికి ప్యాకేజి ఇస్తామని 2019లో హామి ఇచ్చామని అన్నారు.ఇచ్చిన హామి ప్రకారం 16 వేల 337 మందికి ప్యాకేజి ఇచ్చేందుకు సిఎం అంగీకారం తెలిపారని అన్నారు. అలాగే ఒకోకుటుంబానికి 25 వేల రూపాయాలు ప్యాకిజి చెల్లిస్తామని తెలిపారు.35 కోట్లా 75 లక్షల రూపాయాలు నిధులు రిలీజ్ అయ్యాయని ఎపిజెన్‌కో 3వ యూనిట్‌కి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్టోబర్ మొదటి వారంలో ఆయన రావడం జరుగుతుందని శంకుస్దాపన చేస్తారని తెలిపారు.సిఎం చేతుల మీదుగా లబ్దిదారులకు అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అన్నారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో కృష్ణపట్నం పోర్టు అభివృద్ది చెందిందని పోర్టుతోపాటు కొని ్న ఆధారిత పరిశ్రమలు రావడం జరిగిందని అన్నారు.ఇప్పటికే కొన్ని పరిశ్రమలలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందని అన్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి చెప్పిని వన్ని ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని అన్నారు.ఈ మత్యకారతరే ప్యాకేజి మండలంలో పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మెట్టా విష్ణువర్దన్‌రెడ్డి,ఎంపిపి గండవరం సుగుణ,సర్పంచ్‌లు ఆలపాటి శ్రీనయ్య,ప్రతాప్,నాయకులు మునుపూరుఏ జనార్దన్‌రెడ్డి,నెల్లూరు శివప్రసాద్,మండల యూత్ అద్యక్షులు దువ్వూరు తేజారెడ్డి,తదితరులు పాల్గోన్నారు.

## ఆలిండియా క్యాంపస్ పరీక్షల్లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం




**కావలి రూరల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త** కావలి గుర్రం వారి వీధిలోని నారాయణ మెయిన్ బ్రాంచి పాఠశాల విద్యార్థులు 2021–22 ఆలిండియా క్యాంపస్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చూపి ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి మాట్లాడారు. ఆలిండియా స్థాయిలో కావలి నారాయణ విద్యార్థులు ప్రతిభను కనపర్చడం ఎంతో సంతోషంగా వుందన్నారు. ఇలాంటి ఫలితాలు రాబోవు రోజుల్లో మరెన్నో సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఇలాంటి పరీక్షల వల్ల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు.చదువుల్లో కానీ క్రీడల్లో కానీ నారాయణ విద్యార్థులు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఒలంపియాడ్ పరీక్షల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ...** పట్టణంలోని శాంతినగర్‌లో వున్న నారాయణ పాఠశాల రెండో బ్రాంచ్ విద్యార్థులు ఒలంపియాడ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజియం రవివర్మ మాట్లాడుతూ నారాయణ విద్యార్థులు అన్ని రకాల పరీక్షల్లో ముం దుంటారన్నారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ చందు, కోఆర్డినేటర్ రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ సుమంత్, వైస్‌ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కల్తీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

**సైదాపురం, సెప్టెంబరు 12, ప్రభాతవార్త:** పురుగుమందుల దుకాణదారులు రైతులకు కల్తీ మందులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇంట ర్నల్ స్పెషల్ స్క్వాడ్ ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఉన్న పురుగుమం దుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమావతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగుమం దులు అధిక ధరలకు విక్రయించరాదని, కల్తీ మందులు అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దుకాణాల్లో స్టాక్ నిల్వ లేనందున రబీ సీజన్ రానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ స్టాక్ నిల్వ చేసుకోవాలన్నారు.

